కొత్త కాపురం

శ్రీ తేకుమళ్ల కామేశ్వరరావు

ఆనందమూర్తి కళాశాలలో చదువుకొంటూన్న రోజులలో మధుర జీవితం గురించి కలలు కన్నాడు. జీవితమే ఆనందం, ప్రియాంగనయే మధుభాండం, సంసారమే అమృత సరోవరం అనే ఊహాలోకాన్ని సృష్టించుకొన్నాడు.

అతని చదువు పూర్తయింది.

తండ్రి చదువుకున్న చుక్కని చూసి కొడుక్కి ముడిపెట్టేడు.

ఆనందమూర్తికి రాజమహేంద్రవరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం వచ్చింది. ఏదో ఒక అద్దె ఇల్లు చూశాడు. అందులో సామానులు పడవేశాడు.

లోలాక్షి కాపరానికి వచ్చింది. ఆమెకు ఆ ఇల్లు నచ్చలేదు. ఏవేవో కోరికలు కోరింది. అవెంతమట్టుకు సాధ్యమో ఆనందమూర్తికి తెలియలేదు. అయినా భార్యమాట ఎందుకు తీసివెయ్యాలని ఇంటికోసం వెతికేడు. కేటాయింపుగా ఉన్న వాటా ఒకటి దొరికింది. ఎంతో సంతోషించేడు. అందులోకి మారేరు.

వారు సంసారం పెట్టి వారంరోజులయింది. ఇద్దరూ హోటలులో భోంచేసి వస్తున్నారు. ఆనందమూర్తికి అదేమీ అర్థం కాలేదు. ఆ విషయమై భార్యతో ఏమాత్రరుగా ప్రసంగం తేవాలో బోధపడలేదు. ఒకవైపు డబ్బుబాధ! మనస్సులో బాధ! మాటలు వాటంతటవే బైటపడ్డాయి.

లోలాక్షి "టిఫిన్ క్యారియర్ కొని తెండి. దానితో తెప్పించుకొందాం!" అంది.

నీటిలో నీడలు

ఫొటో: శ్రీ జి. యస్. భూషణ్



★ కొత్తకాపరం

అతను అందుబాటులో ఉన్న అల్యూమినియమ్ టిఫిన్ కారియర్ కొని తెచ్చేడు.

హోటలునుంచి టిఫిన్ కారియర్‌తో భోజనం యింటికి వస్తుంది ఇద్దరూ విస్తరాకులు వేసుకొని భోంచేసి లేచిపోతారు. పనిమనిషి వచ్చినప్పుడు శుభ్రం చేస్తుంది.

ఒక నెల గడిచింది. ఆనందమూర్తి గడబిడ పడుతున్నాడు. ఏమీ తోచడం లేదు. సంసారం బాధగా పరిణమించింది. "నీకు వంటచెయ్యడం వచ్చా?" అని భార్యని మర్యాదగా ప్రశ్నించేడు.

'అదెట్లాగో! నేను చదువుకోలేదబ్బా! ఇంటర్‌లో ఆ సబ్జక్టే లేదు' అంది.

ఆ జవాబుతో అతను అణగారేడు.

పొద్దున్న టిఫిన్, మధ్యాహ్నం టిఫిన్ హోటేలునుంచి వస్తాయి.

లోలాక్షి పొద్దున్నే లేచి బొట్టుపెట్టె దగ్గర పెట్టుకొని జడ వేసుకొని, తలపిన్ను పెట్టుకొని, సబ్బుతో తోముకొని, మొహం పౌడి అద్దుకొని, లిప్ స్టిక్ పూసుకొంటుంది. ఇంటికి తమలపాకులు, పువ్వులు వాడుకగా వస్తాయి. ఆమె ఏదో పుస్తకం తీసుకొని కూర్చుంటుంది. ఇంతటిలో వార్తాపత్రికల కుర్రవాడు కిటికీలోంచి పత్రిక పడవేసి పోతాడు. దానిని ముందు పెట్టుకొని కూర్చుంటుంది. అంతటిలో ఫలహారం రాగా, పుచ్చుకొని ఆకులు పారవేసి, గ్లాసు పక్కని పడవేస్తుంది. మళ్ళీ పుస్తకం తీసుకొని కూర్చుంటుంది. అతను ఏమనగలడు? ఊరికే మధనపడతాడు. మాటలు పైకిరావు.

చదువుకొన్న ఇల్లాలు గృహాలంకరణం, అంటే సుమ్మం తెరలు, కొన్ని కొన్ని రకాల అల్లికలు అల్లగలదని అతను తలపోశాడు. కాని లోలాక్షికి వాటిని కళాశాలలో నేర్పలేదట! కాబట్టి రావు.

సాయంత్రం పూట ఇద్దరూ షికారు వెళ్లడం లేదని లోలాక్షి సునిసేది.

కాని ఆ పేచీ ఉద్యోగమే తీర్చింది. అతను పొద్దుపోయిగాని ఆఫీసునుంచి ఇంటికి రాడు. ఒక్క ఆదివారమే అతని వశంలో ఉంది. ఆ రోజున ఇద్దరూ సినీమా చూడడానికి పోతారు. కాబట్టి షికారులు దూరమై పోయేయి.

'మీ కాపరం ఎట్లాగుందో తెలియజెయ్యవలసింది. అంటూ తండ్రి ఉత్తరం రాశాడు. నిండుగా మునిగితే చలే లేదు అన్న సామెత ప్రకారం ఆనందమూర్తి 'అంతా బాగానే ఉంది' అని సమాధానం రాశాడు. తండ్రి పరమ సంతోషంపడ్డాడు.

ఆనందమూర్తి ఇంటిదగ్గిర తన తల్లి కమ్మగా చేసి పెట్టగా తిన్న రోజులు స్మృతికి తెచ్చుకొని లొట్టలు వేశాడు.

లోలాక్షి బట్టల వెర్రి కొక మితమున్నట్టుగా అతనికి తోచలేదు. పైగా ఇప్పటివున్నవి చాలలేదు. ఆమె అతనితో బజారుకి వెళ్ళి మరికొన్ని గుడ్డలు - కొత్త కొత్త రకాలు - కొని తెచ్చుకొంది. వాటిలో తక్కువ ఖరీదుది ఒక్కటి లేదు. ఏమంటాడు? కళ్ళప్పగించి చూశాడు.

"ఈ సంసారంలో పొదుపు ఎలాగు? అదీ అతని సమస్య! "పోనీ నేను వంట చేసి చూడనా, పోతేపోయింది! పొద్దున్న లేచి ఆఫీసుకి వెళ్ళేదాక నేను పడేపాటు ఏముంది కనక! కాబట్టి వంట చేసి చూస్తాను!' అని నిర్ణయించుకొన్నాడు. కాని భార్యకి మాత్రం చెప్పలేదు. అడితికి వెళ్లి కట్టెలు, బొగ్గులు

[41 వ పేజీ చూడండి]



★ కొత్తకాపరం ★

(24-వ పేజీ తరువాయి)

తెచ్చేడు. బజారుకి వెళ్లి బియ్యం, పప్పులు, ఉప్పులు, కూర నార మితంగా కొని తెచ్చేడు. పెట్టెలోంచి గిన్నెలుతీసి ఇవతల పెట్టేడు. లోలాక్షి చిత్రంగా చూసి 'ఏమిటీ పని ?' అని అడిగింది.

'వంట ప్రయత్నం !'

'అది మీకు సాధ్యమా !' అని ఆశ్చర్యపోయింది.

'ఏమో, చేతయినంతమటుకే చేస్తాను !"

"మీకు వస్తుందేమోకాని నాకు అసలే రాదబ్బా !' అంది.

అతను ఎంతో శ్రమపడ్డాడు. వంట అంత సులువుగా అయేపని కాదని తెలుసుకొన్నాడు. పైగా ముందు ఎన్ని అమర్చుకొంటే గిన్నె పొయ్యిమీదికి ఎక్కించడం! విసుగెత్తింది, చిరాకు పుట్టింది.

వంటమాట ఎట్లాగున్నా, పోనీ కాఫీ ఫలహారాలేనా తయారు చేసుకొందామని ఊరిసేడు. వాటికి అవసరమైన సరుకులు తీసుకువచ్చేడు. ఒక శేరు గోధుమలు మిల్లులో రవ్వగా పోయించేడు. దానిలో పొట్టు అంతా ఉంది. అది వేరుచేసే ఉపాయ మేమిటి ? తన తల్లి మిల్లులో పోయించినప్పుడెల్లా, చేటతో చెరిగి, పొట్టు, పిండి, సన్నరవ్వ, ముతకరవ్వ అని నాలుగు విధాలుగా తీసేది. ఆమె నేర్పును తలుచుకొని అతను విస్మయపడ్డాడు. కాని ప్రయోజనం శూన్యం !

ఆఖరికి కాఫీయేనా తయారు చేసుకొందామని ఆనందమూర్తి తహతహలాడేడు. నానావస్థలుపడి కుంపటి వెలిగించేడు. కళ్ళనీళ్లు తుడుచుకొన్నాడు.

భార్య అతన్నిచూసి జాలిపడి 'ఎందుకొచ్చినపాట్లు అవి !' అంది.

'కడుపుకోసం పడే తిప్పలు ! ఇది లేకపోతే ప్రాణమే ఉండేటట్లు కనబడదు !' అన్నాడు భర్త.

లోలాక్షి అతని శ్రమచూసి నొచ్చుకొని తనుకూడ శ్రమలో పాల్గొనదలిచింది.

కుంపటిమీద నీళ్లు కాగుతున్నాయి.

'ఆమె నేను కాఫీపొడిమీద నీళ్ళు పోస్తాను' అంది.

'సరే ! పొయ్యి !' అన్నాడు భర్త.

ఆమె పట్టుకారును గిన్నెకి తగిలించి ఒక చేతితో దింపబోయింది. సరిగా పట్టు దొరకనందున గిన్నె కిందపడింది. నీళ్లు అటు ఇటు చిందేయి. ప్రమాదం తప్పింది!

'దేవుడికి నా మీద దయ పూర్తిగా ఉంది. కాకపోతే ఈ రోజు ఇట్లా గడిచేది కాదు' అని ఆనందమూర్తి ఆనందపడ్డాడు. అతను ఒకందుకు విపరీతంగా సంతోషించేడు. లోలాక్షి పనులు చేతగాక చెయ్యడం లేదుకాని చేస్తే నామోషీ అని కాదు. ఎగిరి ఆకాశాన్ని అందుకొన్నట్టుగా సంబరపడ్డాడు.

అతనికివచ్చే జీతం రాళ్ళు ఎందుకూ కాకుండా పోతున్నాయి. తండ్రికి డబ్బు పంపమనిరాస్తే 'నువ్వు వచ్చిన దానితోటే సరిపెట్టుకోవాలిరా అబ్బాయీ!' అని ముద్దు ముద్దుగా చీవాట్లు పెట్టేడు. ఆనందమూర్తి "జానపదకథలలో చెప్పే గిన్నె ఎక్కడేనా దొరికితే బాగుండును. అది బోర్లించి తియ్యగానే కోరిన వన్నీ సమకూడుతాయట!' అని వ్యర్థంగా తలపోశాడు. స్నేహితులదగ్గర అప్పు సప్పులు చేశాడు. అవి తీర్చే దారేమిటో కనబడదు. 'పొదుపు; పొదుపు'! అని మొత్తుకొంటున్నాడు. 'మన శ్శాంతి ! మనశ్శాంతి!' అని కలవరిస్తున్నాడు.

లోలాక్షికి కూడ ఈరకం జీవితం నచ్చలేదు. పైగా ఆమెకు హోటేలు మెతుకులు సరిపడలేదు. సుస్తీ చేసింది. ఆసుపత్రినుంచి మందు తెచ్చి పెట్టడ మొకటి ఆనందమూర్తికి అదనపు పని అయింది. ఆమె కూడ ఈబాధలనుండి విడివడితే బాగుండునని తలపోసింది. కాని దారేమిటి ?

అతను సాహసించి "మీ అమ్మగారు నీకు ఇంటిపనులు నేర్పలేదా ?" అని అడిగేడు.

"మీకు రానట్టే నా కూరావు. మీకు మీ అమ్మగారు నేర్పించేరా ఏమిటి చెప్పండురూ ?" అని ఎదురు ప్రశ్నించింది.

'నేర్పిస్తే మనకీ పాట్లే లేకపోను. అది కాదు. అందరి ఆడవాళ్ళకి ఇవి వస్తాయి కదా అని నేనడగడం ?'

'పుట్టుకతోనే వస్తాయని కమోను మీ ఊహ !'

'కాదులే!' అని వేలు కరుచుకొని 'వంటయినా నేర్పనిదేరాదు' అని తనలో తను సమాధానం చెప్పుకొన్నాడు.

లోలాక్షి 'నేను చదువుకొన్న కాలేజి చదువులో అవి లేవు. ఇంటి దగ్గరఉన్నంతసేపూ చదువుతోటే సరిపోయేది కాబట్టి మా అమ్మ నేర్పలేదు. మరే లాగు వస్తుంది' అని ప్రశ్నించింది.

"అయితే లోటు మనది కాదన్నమాట!

"ఎంతమాత్రమూ కాదు!"

'మరెవరిదో అయుండాలి!' అనుకొన్నాడు ఆనందమూర్తి. 'ఎవ్వరిదైనా నాకిప్పుడొరిగే లాభం ఠవ్వంతైనా లేదు' అని ఊరుకొన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. కాని అతని క్షేమీ పాలుపోడం లేదు.

అతను వంటవిషయమై మరొకసారి గట్టి ప్రయత్నం చేద్దామనుకున్నాడు. భార్యతో కూడ ఆలోచించేడు. అన్నీ కూడ బజారునుంచి తేవలసిన సరుకులే కనబడ్డాయి! బియ్యం, అపర దినుసులు,—కట్టెలు, బొగ్గులు ఆలాగుండనియ్యండి—అప్పడాలు, వడియాలు, ఊరగాయలు, వడ్పళ్లు, చారుపొడి, కూరపొడి, పులుసుపొడి, వీటికి తోడు లోలాక్షి జాస్తు, డబ్బా ఆహారాలు కూడ రానిచ్చింది. హోటేలునుంచి తెప్పించుకోడమే అతనికి చవకగా కనబడింది. 'వరహాల చెట్టొకటుంటే బాగుండును! మొదట దానికోసం తపస్సు చేసి తర్వాత సంసారం పెట్టుకొంటే బాగుండును! ఇది సంసారమా ? యమలోకమా ? సంసారమంటే ఇలా గుంటుందని ఇదివరకు ఊహించలేకపోయేను!' అని విచారించేడు. తల్లి కమ్మగా చేసిపెడుతూంటే తిన్న రోజులు జ్ఞాపకానికి వచ్చేయి. ఇప్పటి కర్మను తలుచుకొని దుఃఖించేడు. తన భార్య చేదోడు నీళ్ళేనా తోడలేదు. పనిమనిషి తోడిపెడితే చెంబుతో తీసుకొనడమే అపురూపం! ఒకవంక నాజూకుతనం! మరొకవంక చేతకానితనం! అతనికి ఏమీ తోచలేదు. "మా తల్లిని రమ్మని టెలిగ్రాం ఇస్తున్నాను!" అన్నాడు లోలాక్షితో.

"అది మంచిపని! ఆవిడ వస్తే ఇంత ముద్దేనా వండిపడేస్తుంది మన ఇద్దరికి!" అంది ఇల్లాలు.

తల్లిని ఇంటికి తీసుకురావడానికి ఆనందమూర్తి రైలుస్టేషన్‌కి వెళ్ళేడు. స్త్రీ సమాజంలో జరుగుతూన్న సభకి లోలాక్షి వెళ్ళింది. ★

రత్నపురుషవేషాం

మహర్షులు కృషిచేయుటచే కలిపి తయారుచేయబడినది శుక్లనష్టము. గుండెదడ. నరముల బలహీనము అతిమూత్రము మొ॥ మేహ వ్యాధులను హరించును. బలమును. కాంతిని. ధాతుపుష్టిని. ఇచ్చును అనేక యోగ్యతా పత్రాలు కలవు డబ్బా రు 3-12-0 వి. పి. అ. 14

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు - విజయవాడ-2.